షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సంఘం రాష్ట్ర సభ్యుడిగా ప్రణవ్‌కుమార్

మగ్గిడి ప్రణవ్‌కుమార్

జన్నారం, డిసెంబర్ 15 : షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సంఘం రాష్ట్ర మెంబర్‌గా మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మగ్గిడి ప్రణవ్‌కుమార్‌ను నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ సుదర్శన్ బాబు నియమాక పత్రాన్ని అందించినట్లు సోమవారం ప్రణవ్ కుమార్ తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తానని పేర్కొన్నారు.

సమస్యలు తీర్చేవరకు పోరాడుతాం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 16 : ఆశ కార్యకర్తల సమస్యలు తీర్చాలని, అప్పటివరకు పోరాడుతామని ఆ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లాలో 15న ప్రారంభమైన ఆశ బస్సు జాత సోమవారం మంచిర్యాల జిల్లాకు చేరుకున్నది. పట్టణంలోని హరిత ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క అధ్యక్షతన రాష్ట్ర బస్సు జాత బహిరంగ సభ నిర్వహించారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఆశ రాష్ట్ర కోశాధికారి గంగామణి, ఆశ వర్కర్ యూనియన్, సాధన ఆశ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, పద్మ, ఆశ రాష్ట్ర సహాయ కార్యదర్శులు సునిత, రాష్ట్ర నాయకులు బాలమణి, సమ్మక్క, శోభ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులున్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 16 : బస్సు జాత జిల్లా కేంద్రానికి చేరుకోగా స్థానిక ఆరే సంక్షేమ సంఘ భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బస్సు జాత బృంద సభ్యులు ఎం బాలమణి, ఎన్ పద్మ, ఆర్ సాధన, గంగామణి, ఆర్ నీలాదేవి, సునీతా, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 16 : మంచిర్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలను సోమవారం నస్పూర్‌లోని కృష్ణకాలనీ శివాలయం మైదానంలో నిర్వహించారు. ఈ పోటీలను అసోసియేషన్ చైర్మన్ నిట్టూరి మైసూర్, జిల్లా అధ్యక్షుడు పాదం రవీందర్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లాలో బాక్సింగ్‌పై క్రీడాకారులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. జాతీయస్థాయిలో ముగ్గురు బాక్సింగ్ క్రీడాకారులు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ పతకాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్‌లో 20వ తేదీ నుంచి జరుగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజు నాయక్, సీఐఎస్ఎఫ్ గోల్డ్‌మెడలిస్ట్ పాదం మహేందర్, నాయకులు మంతెన మల్లేశ్, అంగడి రాజేశ్, పంబాల ఎర్రయ్య, శివాలయం కమిటీ సభ్యులు బోరపాటి మారుతి, బాక్సింగ్ కోచ్‌లు జగత్‌సాయి, శ్రీకాంత్, సందీప్, రంజిత్, జేఎస్‌పీ బాక్సింగ్ క్లబ్ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

18న కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్/నస్పూర్, డిసెంబర్ 16 : మంచిర్యాల బాలుర పాఠశాల మైదానంలో ఈ నెల 18 జూనియర్స్ జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి రాంచంచర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన బాలికల జట్టు క్రీడాకారులు 22 నుంచి 25వ తేదీ వరకు హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో.., అలాగే బాలుర జట్టు 27 నుంచి 30వ తేదీ వరకు జనగామలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2005, జనవరి 12లోపు జన్మించి ఉండాలని, బాలురు 70 కిలోలలోపు, బాలికలు 65 కిలోలలోపు ఉండాలని సూచించారు. వివరాలకు 99637 19719 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రేగులగూడ హెడ్‌మాస్టర్‌కు ఏడాది జైలు

కాసిపేట, డిసెంబర్ 16 : కాసిపేట మండలం రేగులగూడ పాఠశాలలో (2013లో) విధుల్లో అశ్రద్ధ వహించి, మోసం చేసిన హెడ్‌మాస్టర్ రొడ్డ గోపాల్‌కు ఏడాది జైలుతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జే ముకేశ్ సోమవారం తీర్పునిచ్చినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగులగూడ పాఠశాలలో 2013, సెప్టెంబర్ 29న 46 మంది విద్యార్థులు హాజరవగా, 136 మంది హాజరైనట్లు తప్పుగా నమోదు చేశారు. ఆపై ప్రభుత్వ డబ్బు కాజేశారని అదే ఏడాది నవంబర్ 21న ఉట్నూర్ పీవో నివాస్ ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌హెచ్‌వో బీ స్వామి కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ చేశారు. రొడ్డ గోపాల్‌పై ఎస్ఐ జే సురేశ్ చార్జిషీట్ చేశారు. ఈ కేసులో ప్రస్తుత ఎస్‌హెచ్‌వో ఏ ఆంజనేయులు కోర్టు కానిస్టేబుల్ కే దేవేందర్ సాక్షులను పీపీ ముందు ప్రవేశపెట్టారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే అజయ్ కుమార్ ప్రధాన సాక్షుల తరుపున వాదించగా, బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ సాక్షులను విచారించారు. నేరం రుజువుకావడంతో రొడ్డ గోపాల్‌కు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కొండచిలువ పట్టివేత

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 16 : చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామంలో ఫారెస్ట్ అధికారులు సోమవారం కొండచిలువను పట్టుకున్నారు. ఆ గ్రామంలోని సత్యనారాయణ రెడ్డి గోశాలలో కొండ చిలువ దూరి అక్కడ ఉన్న రెండుమూడు కోళ్లను మింగింది. దీంతో గోశాల నిర్వాహకుల సమాచారం మేరకు అక్కడే డ్యూటీలో ఉన్న డిప్యూటీ రేంజ్ అధికారి పీ ప్రభాకర్, బేస్ క్యాంప్ వాచర్ దాసరి అశోక్ కొండచిలువను చాకచక్యంగా ఒక సంచిలో బందించారు. అనంతరం అడవిలో విడిచిపెట్టారు.

61వ సారి రక్తదానం

కాసిపేట, డిసెంబర్ 16 : రక్తదానం చేయడమేగాక విద్యార్థులు, మిత్రులు, బంధువులను చైతన్య పరిచి వారితోనూ రక్తదానం చేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు ధర్మారావుపేట జడ్పీహెచ్ఎస్ ఆంగ్ల ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాబ్జీ. ట్యాంక్ బస్తీకి చెందిన బాబ్జీ సోమవారం మంచిర్యాల వలంటరీ బ్లడ్ బ్యాంక్‌లో 61వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశాడు. అలాగే సోమగూడేనికి చెందిన మరో ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరిపోతుల కుమార్‌తోనూ రక్తదానం చేయించాడు. ఇప్పటికే మూడుసార్లు ప్లేట్‌లెట్స్ ఇవ్వడంతో పాటు 61 సార్లు రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నాడు. గతంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

ప్రతి గ్రామాన్ని సందర్శించాలి

నెన్నెల : ఎస్ఐ ప్రసాద్‌ను క్రైం రేటు వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాసులు

నెన్నెల, డిసెంబర్ 16 : పోలీసులు ప్రతి గ్రామాన్ని సందర్శించాలని, విజబుల్ పోలీసింగ్ నిర్వహించాలని రామగుండం సీపీ శ్రీనివాసులు సూచించారు. నెన్నెల పోలీస్టేషన్‌ను సోమవారం రాత్రి మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి సందర్శించారు. పోలీసులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. మావోయిస్టు కుటుంబ సభ్యులు, సానుభూతిపరుల వివరాలు, నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు గుర్తించి ముందుస్తు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ఎస్ఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లి హెడ్ క్వార్టర్స్ సందర్శన..

బెల్లంపల్లి, డిసెంబర్ 16 : బెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్‌ను సోమవారం రామగుండం సీపీ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా డీసీపీ భాస్కర్ తో కలిసి ఆర్మ్డ్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆర్ఐ కార్యాలయాలను పరిశీలించారు. విధుల గురించి ఆర్ఐలను అడిగి తెలుసుకున్నారు. హెడ్ క్వార్టర్ గ్రౌండ్‌ను పరిశీలించి కొత్తగా వచ్చిన కానిస్టేబుళ్లకు స్పెషల్ పార్టీ విధులకు సంబందించిన శిక్షణ త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

మందమర్రి, డిసెంబర్ 16 : ఉద్యోగులం దరూ రక్షణ సూత్రాలను పాటిస్తూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని మందమర్రి ఏరియా జీఎం జీ దేవేందర్ సూచించారు. సింగరేణి 55వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా రక్షణ కమిటీ కన్వీనర్, జీఎం(ఐఅండ్‌పీఎం) బీ శ్రీనివాసరావు, జీఎం, బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ కే రఘుకుమార్, సేఫ్టీ ఆఫీసర్ ఎం రవీందర్ సోమవారం మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిని సందర్శించి, రక్షణ చర్యలను పరిశీలించారు. అనంతరం గని పై ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం దేవేందర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన రక్షణ పరికరాలు, పనిముట్లను ఉపయోగించాలని సూచించారు. అనంతరం కమ్యునికేషన్ సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన రక్షణ జాగ్రత్తలపై కళాకారులు ప్రదర్శించిన లఘు నాటిక ఆకట్టుకున్నది. రక్షణలో కేకే 5గని అండర్ గ్రౌండ్ మైన్స్ గ్రూపు-03 ప్రథమ బహుమతి సాధించింది. అలాగే 2023లో బెస్ట్ యాక్సిడెంటల్ ఫ్రీ పర్సన్‌గా గని మాజీ కోల్ కట్టర్ కార్మికుడు అంజయ్య నిలువగా, జీఎం, అధికారులు బహుమతులు అందజేశారు. కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, డీవైపీఎం(ఐ అండ్ పీఎం) పీ శ్రీనివాస్, కేకే 5 డీజీఎం ప్రవీన్ వీ ఫాటింగ్, ఎస్ఈ(ఈ అండ్ ఎం) ఎట్టీపీపీ ఉమాకాంత్, ఎస్ఎస్‌వో జీఎం ఆర్డీ3 జనార్దన్ రెడ్డి, ఇల్లెందు జేకే ఓసీ ఎస్‌వో డేవిడ్, భూపాలపల్లి ఎన్విరాన్‌మెంట్ అడిషనల్ మేనేజర్ పోశమల్లు, ఆర్3 మెడికల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఆర్‌టీ మందమర్రి ఏరియా హెచ్ఓఎం మనోహర్, హెచ్‌వోఎం డబ్ల్యూఐ మైనింగ్ పీపీకే 5 రాజేశ్వర్, ఎఫ్ఎం డబ్ల్యూఐ ఎలక్ట్రికల్ రవి, ఎఫ్ఎం డబ్ల్యూఎంఐ మెకానికల్ నాగమోహన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్కే 6 గనులపై రక్షణ వారోత్సవాలు..

శ్రీరాంపూర్, డిసెంబర్ 16 : శ్రీరాంపూర్ ఏరియా ఓసీపీ, ఆర్కే 6 గనిపై రక్షణ వారోత్సవాలు నిర్వహించారు. శ్రీరాంపూర్ ఓసీపీపై అధికారుల బృందానికి పీవో శ్రీనివాస్, సేఫ్టీ తనిఖీ కన్వీనర్ జీఎం (ఎక్స్‌ప్లోజివ్) డీ బైద్య స్వాగతం పలికారు. అనంతరం ఓసీపీపై ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సేఫ్టీ తనిఖీ బృందం ఓసీపీని సందర్శించి, క్వారీలో చేపడుతున్న రక్షణ చర్యలు పరిశీలించారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఈఈ చంద్ర శేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు షేక్ మినాజుద్దీన్, అదనపు మేనేజర్ మురళీధర్, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి ఎం కొమురయ్య, సీనియర్ పీవో శంకర్ పాల్గొన్నారు. ఆర్కే 6గనిపై జీఎం సూర్యనారాయణ, ఏజెంట్ శ్రీధర్, సేఫ్టీ కమిటీ కన్వీనర్ జీఎం(ఎన్విరాన్‌మెంట్) సైదులు, అదనపు మేనేజర్ శ్రీధర్, రాధాకృష్ణ, మేనేజర్ తిరుపతి స్వాగతం పలికారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, పిట్ కార్యదర్శి సదానందం ఉన్నారు.

విద్యార్థులకు రాష్ట్రస్థాయి బహుమతి

ఆదిలాబాద్ కలెక్టర్ శ్రీరాజర్షి షా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

జన్నారం, డిసెంబర్ 15 : రాష్ట్రస్థాయి చెకుముకి క్రీడల్లో జన్నారం మండలం కిష్టాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అకుల అన్వేష్, అకుల సిద్ధార్థ, ఈర్ణాల అంజన్న తృతీయ స్థానంలో ప్రతిభ చూపారు. కాగా, ఆదిలాబాద్ కలెక్టర్ శ్రీరాజర్షి షా చేతుల మీదుగా బహుమతి అదుకున్నారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న, దముక కమలాకర్, స్కూల్ చైర్‌పర్సన్ మంగ అభినందించారు.

సంతకాల సేకరణలో పాల్గొనాలి

జైపూర్, డిసెంబర్ 16 : సింగరేణి కార్మికులకు అమలు కాని హమీలు ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేఖంగా చేపడుతున్న సంతకాల సేకరణ కార్యక్రమంలో కార్మికులు ప్రత్యక్షంగా పాల్గొనాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఖని 1ఏ గనిపై సోమవారం ఉదయం షిఫ్టులో గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మికులు సొంతింటి కల, ఐటీ మాఫీ, సీబీఎస్సీ సిలబస్ తదితర అంశాల పరిష్కారానికి కార్మికులు ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అందోళనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గుళ్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు తోడె సుధాకర్, నాయకులు బొజ్జ నవీన్, వెంకట్‌రెడ్డి, బోడకుంట శంకర్, వెంకటేశ్వర్లు, మోయిను ద్దీన్, కీర్తిరాజు, కృష్ణస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన బ్లూ కోల్ట్ పోలీసులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 16 : రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఓ యువకుడి ప్రాణాలను బ్లూ కోల్ట్ పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల చున్నంబట్టి వాడకు చెందిన మైదం పురుషోత్తం (29) కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. మద్యం తాగి ఇంట్లో గొడవపడుతుండేవాడు. సోమవారం మద్యం మత్తులో కాలేజ్‌రోడ్డులోని ఎడ్లవాడ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు ప్రదీప్, సాయి అక్కడికి వెళ్లి, పురుషోత్తంను కాపాడారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి, వారికి అప్పగించారు.

కంపెనీస్థాయి క్రికెట్ పోటీలకు ఏర్పాట్లు

తాండూర్/రెబ్బెన, డిసెంబర్ 16 : బెల్లంపల్లి ఏరియా గోలేటి పరిధిలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న కంపెనీస్థాయి క్రికెట్ పోటీల్లో భాగంగా మాదారం లాల్ బహుదూర్ స్టేడియం, గోలేజి భీమన్న మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జీఎం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోలేటి భీమన్న మైదానం, మాదారం క్రీడా మైదానంలో సోమవారం నుంచి పోటీలు సాగనున్నాయి. సింగరేణి వ్యాప్తంగా ఆరు జట్లు పోటీల్లో పాల్గొననున్నాయి. రాత్రి కూడా క్రీడాకారులు సాధన చేసేందుకు మైదానాల్లో లైట్లు, సౌకర్యాలు కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, డిసెంబర్ 16 : బెల్లంపల్లి ఏరియా గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ప్రతి నెలా 16వ తేదీన సేవా సమితి ద్వారా హైదరాబాద్ మాతా రీసెర్చ్ సెంటర్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు పేర్కొన్నారు. సోమవారం వైద్య శిబిరాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడారు. సింగరేణిలో విధులు నిర్వహించే ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరం సద్వినియోగం చేసుకొని, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్(ఎస్ఈ) మదీన బాషా, తదితరులున్నారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా శంకర్

కోటపల్లి, డిసెంబర్ 16 : పీఆర్టీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కోటపల్లి మండల కేంద్రానికి చెందిన కొట్టె శంకర్ ఎన్నికయ్యారు. పీఆర్టీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

కాగజ్‌నగర్, డిసెంబర్ 16 : కాగజ్‌నగర్ మండలం గన్నారంలో బాధిత కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. గన్నారం గ్రామానికి చెందిన అనూష (20) అదే గ్రామానికి చెందిన సందీప్ మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. సందీప్ పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపానికి గురైన అనూష ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో అనూష ఆత్మహత్యకు కారకులైనవారిపై కేసు నమోదు చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు సందీప్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి రూరల్ సీఐ శ్రీనివాస రావు, ఎస్ఐ మహేందర్ చేరుకొని, న్యాయం చేస్తామని స్పష్టంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 16 : జిల్లా కేంద్రంలోనీ సీసీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతయ్య సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. తిరుపతయ్య మృతదేహం వద్ద కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్ నివాళులర్పించి, కుటుంబానికి రూ.30 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రాణా ప్రతాప్, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ శంకర్ ఉన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 16 : ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పోలీసు సిబ్బందితో మాట్లాడి, పరిష్కరిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట, డిసెంబర్ 16 : కాసిపేట మండలం కొండాపూర్ యాప వద్ద రోడ్డుకు మరమ్మతులు చేయాలని తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అట్కుపురం రమేశ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్ దీపక్ కుమార్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. కాసిపేట, కొండాపూర్ యాప మధ్యలోని రోడ్డు పగళ్లు తేలి, భారీ గుంతలుగా మారిందని, వర్షం పడితే చెరువును తలపిస్తున్నదని, సరైన రోడ్డు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే రోడ్డు వేయాలని కోరారు. పలు సమస్యలపై వినతి పత్రం అందించారు.

భీమారం, డిసెంబర్ 16 : భీమారంలో విద్యార్థులు, యువకులకు క్రీడా మైదానం లేదని, ఏర్పాటు చేయాలని కోరుతూ మండలానికి చెందిన యువకులు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో మధుసూదన్‌కు వినతి పత్రం అందించారు. ఎన్నిసారు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, క్రీడాకారులు, నిరుద్యోగయువతను దృష్టిలో పెటుటకొని క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రామల్ల రాజ్‌కుమార్, రాపెల్లి రాజన్న యాదవ్, బీ విశాల్, జీవన్‌రెడ్డి, మహేశ్, సానిత్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్, డిసెంబర్ 16 : మండలంలోని గ్రామ పంచాయతీల్లో మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ నాయకులు ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో మీ సేవ కేంద్రాలు లేకపోవడంతో ప్రతీ అవసరానికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని పేరొకన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, షేక్ అహ్మద్, పుట్ట శ్రీనివాస్, షేక్ మోమిన్ అలీ, దుర్గం రామకృష్ణ, ఆకుల వెంకటేశ్, బానేశ్, మల్లేశ్, మాణిక్‌రావు, అంజి, తదితరులున్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

కెరమెరి, డిసెంబర్ 16 : మండలంలోని గోయగాం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా భరోసా టీం, ఆసిఫాబాద్ డివిజన్ షీ టీం ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. భరోసా టీం ఇన్‌చార్జి తిరుమల మాట్లాడుతూ.. బాల, బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం అమలులో ఉన్న శిక్షలు, బాల్య వివాహ నిరోధక చట్టంపై వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా సెంటర్ ఎస్ఐ తిరుమల, విజయలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనితనాన్ని మెరుగుపర్చుకోవాలి

మందమర్రి, డిసెంబర్ 16 : గనిలో ఉద్యోగులందరూ తమ పనితనాన్ని మెరుగుపర్చుకుంటే నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం సులభతరమవుతుందని మందమర్రి ఏరియా జీఎం, మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ చైర్మన్ జీ దేవేందర్ పేర్కొన్నారు. ఏరియాలోని కేకే ఓసీపై సోమవారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గని ఉద్యోగులు కంపెనీ సూచించిన సూచనలు, సలహాలు పాటించడం వల్ల ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం కంపెనీ ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సాధించిన విషయాలు, భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనుల్లో యంత్రాల వినియోగం, సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ఫైనాన్స్ విషయాలను వివరించారు. పలువురు ఉద్యోగులకు బహుమతులను అందజేశారు. మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ కన్వీనర్, ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, సీఎంవోఏఐ అధ్యక్షుడు రమేశ్, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, డీజీఎం(ఐఈడీ) రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం(ఈ అండ్ ఎం) వెంకటరమణ, గని మేనేజర్ రామరాజు, సంక్షేమాధికారి సందీప్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో 17 నుంచి 21వరకు..

శ్రీరాంపూర్, డిసెంబర్ 16 : శ్రీరాంపూర్ ఏరియాలో 17 నుంచి 21వ తేదీ వరకు గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓసీపీలపై మల్టీ డిపార్ట్‌మెంట్ (ఎండీటీ)సమావేశాలు నిర్వహించనున్నట్లు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థపై కార్మికులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకే యాజమాన్యం గనులు, ఓసీపీలపై మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలు నిర్వహిస్త